క్లుప్తంగా

మెనూ పక్కాగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తిరుమల చైతన్య

జలుమూరు: జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా మెనూ పక్కాగా మలు చేయాలని డిప్యూటీ డిఈఓ తిరుమల చైతన్య అన్నారు. కరవంజ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన మెలకవులు వివరించారు. ఎంఈఓ మాధవరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

యాప్ ద్వారా పనుల పర్యవేక్షణ

మెళియాపుట్టి: ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో చేసిన పలు పనుల స్థితిగతులు తెలుసుకోవడానికి ప్రభుత్వం వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్‌ను ఇచ్చిందని ఎంపీడీఓ పడాల చంద్రకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. 2018 నుంచి ఇప్పటివరకు చేసిన పనులను ఈ యాప్ ద్వారా పరిశీలన చేసి ప్రస్తుత పరిస్థితిని పంపాలన్నారు. మండలంలో 226 పనులు పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఉపాధి సిబ్బంది సహకారాన్ని తీసుకుని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పీఆర్ ఏఈ, ఏపీఓ, ఈసీ పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

ఓటర్ల సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

పాతపట్నం: ఓటర్ల జాబితాకు సంబంధించి ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని, ఓటర్ల నమోదు, సవరణలు, తీసివేతల అంశాల్లో బీఎల్‌ఓలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జెడ్పీ సీఈఓ రావాడ వెంకట్రామన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ నాయకులతో అవగాహన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ బీఎల్‌ఓ తాను సేకరించిన దరఖాస్తుల వివరాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు చూపించి, వారి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పాతపట్నం మేజర్ పంచాయతీలోని 37వ బూత్‌లో సుమారు 1600 పైగా ఓటర్లు ఉన్నారని, అదనంగా మరో బూత్ కావాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు రవిచంద్ర, సరోజిని, అప్పలరాజు, మురళీధరరావు, చక్రవర్తి, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎలక్షన్ డీటీ శైలజ, జనార్దనరావు, నాయకులు సవిరిగాన ప్రదీప్, పైల లక్ష్మయ్య, ఏవీ సురేష్, రామకృష్ణ, వరదరాజులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కుదారులుగా గుర్తించాలి

ఆమదాలవలస: శాశ్వత భూహక్కు కల్పించేలా చొరవ తీసుకోవాలని స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన క్యాంప్ కార్యాలయంలో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గల అవధానుల చెరువు పక్కన ఉన్న భంజరు భూమిని 20 సూత్రాల అమలులో భాగంగా నిరుపేదలకు గతంలో కేటాయించారన్నారు. 2018లో ప్రతీ రైతుకు సర్వే నంబర్ కేటాయించి అగ్రిమెంట్ కూడా చేశారన్నారు. ఇప్పటివరకు పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా రీ-సర్వే చేసి తమను భూ హక్కుదారులుగా గుర్తించేలా చూడాలని విన్నవించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీజీ సత్యనారాయణ ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆమదాలవలస: వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాలశ్రీ

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని ఐజెనాయుడు కాలనీకి చెందిన వృద్ధుడు దానేటి మధుసూదనరావు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ వార్డు కు చెందిన వలంటీర్ మాలశ్రీ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలోని 24 సచివాలయాల్లో మంగళవారం ఉదయానికే పింఛన్ల పంపిణీని వలంటీర్లు ప్రారంభించారు. మండలంలో 10405 మందికి పింఛన్‌దారులకు రూ. 2.81 కోట్లు మంజూరు చేశారు. ఉదయం 9 గంటలకే 80 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయింది.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ అజెండా



బురిడివలసలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- గడపగడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని మర్రిపాడు, బురిడివలస గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు ధీమా అని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రతి ఇంట్లోనూ ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరా తీసి అక్కడికక్కడే పరిష్కరించారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేని ఎల్లోమీడియా, టీడీపీ నాయకులు లేనిపోని విష ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఓర్వలేనితనం ఉన్న వారిని వచ్చే ఎన్నికల్లో ఇంటికే పరిమితం చేయాలని ప్రజలను కోరారు.మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాలసత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యడ్ల ఈశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ బత్తిన వరలక్ష్మి, పార్టీ నాయకులు అదపాక గౌరినాయుడు, పున్నపురెడ్డి తవిటినాయుడు, రావాడ వెంకటరావు, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అదనపు ప్యాకేజీ
చెల్లించేందుకు చర్యలు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కొంతమంది వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించాల్సిన అదనపు పరిహారం నిధులు సమకూర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం విశాఖపట్నం వచ్చిన సీఎం జగన్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. వంశధార నిర్వాసితుల్లో కొందరికి అదనపు పరిహారం చెల్లించటం జరిగిందని, మరి కొందరికి పరిహారం చెల్లించలేదని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని సీఎం మాట ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

త్వరలోనే నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేయటం జరుగుతుందన్నారు. వచ్చే నెలలో సీఎం జగన్ పాతపట్నం పర్యటనకు వస్తున్నట్లు తెలిపారు. రూ.265 కోట్లుతో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వంశధార తాగునీరు అందించే పనులకు భూమిపూజ చేస్తారన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ గోవిందరావు

మెళియాపుట్టి: గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపడాలంటే అవగాహన కల్పించాలని డీపీఆర్‌సీ (జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ రిసోర్స్ పర్సన్) దుంపల గోవిందరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో మంగళవారం సమీక్షించారు. వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోకపోతే ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. గ్రామాలలో స్వచ్ఛ సర్వేక్షణ బృందాల సభ్యులు పర్యటించి, అక్కడి పరిస్థితులపై నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు అందజేస్తారన్నారు. కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి, రిపోర్టులు అందజేయాలన్నారు. చెత్తసంపద కేంద్రాల పనితీరు మెరుగుపడాలని, ఇంకా నిర్మాణం కాని కేంద్రాల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, విస్తరణ అధికారి తారకేశ్వరి ఉన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



బూర్జ: మొక్కలు నాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఓ.వి.పేటలో ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ చెరువు గట్టులపైన, రహదారికి ఇరువైపులా, పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి ప్రస్తుతానికి 2400 మొక్కలు వచ్చాయని, ఇంకా రావల్సి ఉందన్నారు. ఓ.వి పేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: మారుతున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషిచేయాలని ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ కె.ఎ.రాములు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఎన్‌సీసీ 14 ఆంధ్ర బెటాలియన్ కమాండిగ్ ఆఫీసర్ కార్యాలయం నుంచి పాఠశాలకు వచ్చిన మొక్కలను పాఠశాల ఆవరణలో మంగళవారం నాటారు. ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ పి.మోహన్‌రావు, బి.శరత్, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా..
వైఎస్సార్‌సీపీదే విజయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే అధికారం సాధిస్తుందని, వైఎస్ జగన్‌మోహనరెడ్డే రెండో సారి సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 140వ రోజు నరసన్నపేటలోని జగన్నాథపురం ప్రాంతంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీ నాయకులతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. తాగునీటి సమస్య ఉందని మహిళలు తెలిపారు. ఈ సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ల మూడు నెలల్లో ప్రజలకు ఏది అవసరమో దానిని నేరవేర్చుతూ వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిచడంలో వలంటీర్లు సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు పాగోటి రాజారావు, బాలకృష్ణ, రాజాపు అప్పన్న, పంగ బావాజీనాయుడు, చీపురు కృష్ణ, షేక్ బాబ్జీ, పి.సాయిప్రసాద్, సదాశివుని కృష్ణ, వండాన జోగినాయుడు, రావాడ మోహన్‌రావు, ముద్దాడ అప్పలనాయుడు, దండ జయప్రకాశ్, రమణ సాహు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దపేటలో..

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం పెద్దపేటతోపాటు పరిసర వీధుల్లో నిర్వహిస్తామని ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు



రొమదలలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, చికిత్స కన్నా నివారణే మేలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు (ఏడీ) వైద్యుడు మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని రొమదల గ్రామంలో పశువులకు లంపీ స్కిన్ (ముద్ద చర్మ) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలిచారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశువులకు వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కన్నా.. వ్యాధి నిరోధక టీకాలు ముందుగానే వేయించుకుంటే పాడి రైతుకు ఎంతో ప్రయోజనం చేకురుతుందన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో గల 39 ఆర్‌బీకేల పరిధిలో పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. టీకాలు 100 శాతం తప్పనిసరిగా వేయించుకోవాలని, పశువులు ఒడిశా నుంచి ఆంధ్ర సరిహద్దు ప్రాంతానికి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. పాతపట్నం మండలంలో 14,133 తెల్లజాతి పశువులు ఉండగా.. అందులో 11,306 పశువులకు, మెళియాపుట్టి మండలంలో 17,297 పశువులు ఉండగా.. వాటిలో 13,838 తెల్లజాతి పశువులకు టీకాలు వేయించనున్నామన్నారు. టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యారాలు బి.శ్రీవాణి, వల్లభవరావు, ఉత్తమరావు, రామ్మోహనరావు, సర్పంచ్ ఎం.అప్పలనాయుడు, ఎంపీటీసీ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వారికే కండువాలు వేసి..

- పార్టీ మారారని ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి, రామారావు, తదితరులు

ఎల్.ఎన్.పేట: తెలుగుదేశం పార్టీకి చెందిన వారికే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ మారారని ప్రచారం చేసుకుంటున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సరికొత్త రాజకీయాలు చేస్తున్నారని ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు అన్నారు. మండలంలోని చిన్నకొల్లివలస వంశధార పునరావాస కాలనీలో మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో ఆదివారం కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారని కండువాలు వేసి ఫొటోలు పత్రికలకు, సోషల్ మీడియాలో కలమట ప్రచారం చేసుకున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో నిజమైన కార్యకర్త, నాయకుడు, అభిమాని వైఎస్సార్‌సీపీని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వదిలి వెళ్లరని, ఈ విషయం కలమట గుర్తుంచుకోవాలన్నారు. కలమట పార్టీ ఫిరాయించినట్లు.. అందరూ పార్టీలు మారిపోతారని అనుకోవడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. అనేక సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు నిరంతరం అదరిస్తూనే ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. సీఎం జగన్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకత్వానికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తనను బలవంతంగా తీసుకుని వెళ్లి టీడీపీ కండువా వేసి ఇలా ప్రచారం చేసుకున్నారని చిన్నకొల్లివలసకు చెందిన ధర్మాన మాధవరావు పేర్కొన్నారు.

పొందూరు తహసీల్దార్‌గా ప్రసాదరావు



పొందూరు: పొందూరు తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా వైవీ ప్రసాదరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎచ్చెర్లలో డీటీగా ఉన్న ప్రసాదరావును పొందూరు తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాంబాబు దీర్ఘకాలిక సెలవుల్లో ఉండటంతో జి.సిగడాం తహసీల్దార్ పప్పల వేణుకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ప్రసాదరావుకు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో విధుల్లో చేరారు.

ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం

ఆమదాలవలస రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం అన్నారు. మండలంలో తొగరాం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై ఎరువులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగలా మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. వ్యవసాయరంగాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులతోపాటు వ్యవసాయ సామగ్రిని సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, వీఏఏ సత్యసాయి, రైతులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మునగవలసలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని మునగవలస, దన్నానపేట, సంతకొత్తవలస గ్రామాల్లో రూ.1.73 కోట్ల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్, మురుగు కాలువలు, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ రాయి చిన్నారావు, పార్టీ నాయకులు బగాది ఎర్రంనాయుడు, దన్నాన సత్యనారాయణ, గురుగుబెల్లి చంద్రయ్య, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, జేఈ చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి


ఆమదాలవలస: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్మికులు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు తాడి సంతోష్ కుమార్ అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్పిస్తున్నారని అమ్మన్నాయుడుతో సహా 15 మందిని అరెస్టు చేసి సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పశువులు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఆమదాలవలస ఏడీ డాక్టర్ ఆర్.ఆనందరావు సూచించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురంలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలను మంగళవారం వేశారు. ఈ వ్యాధి చర్మం, శ్లేష్మ పొరలపై (శ్వాసకోశ, జీర్ణాశయాంతర ప్రేగులతో సహా) ఏర్పడుతుందన్నారు. పశువుకు విపరీతంగా జ్వరం వస్తుందని, వీటి నివారణకు ప్రభుత్వమే ఉచితంగా టీకాలు వేయిస్తోందన్నారు. పశువైద్య సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆదిత్యనగర్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించే ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలోని ఆదిత్యనగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, ముత్యాలమ్మవీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఆయా కుటుంబ సభ్యులు సంక్షేమ పథకాల ద్వారా పొందిన ఆర్థిక ప్రయోజనాలను గురించి తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. అడ్డదారుల్లో అధికారం పొందేందుకు గ్రామాలకు వస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను నమ్మవద్దన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఈఓ కూర్మారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునరావు, తాతయ్య, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, పనుకు మోహన్, కర్రి లక్ష్మీనారాయణ, షన్ముఖరావు, రాజు, వరదరాజులు, శ్రీనివాసరావు, రామారావు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



